

# మావూరి మహా వైద్యగాడు

జి.ఆర్. మహర్షి

"ఓ రేయ్ రాముడూ..." అంటూ సూరయ్య మామ వచ్చాడు.

"ఏమిటి సంగతి?" అడిగాను.

"కాలిలో ముల్లు గుచ్చుకుందిరా, నొప్పి చేస్తా వుంది" కాలు చూపించాడు.

చీము తీసేసి కాలికి కట్టుకట్టాను.

"కంపల్లోకి వెళ్లేటప్పుడు కొంచెం జాగ్రత్తగా వుండు," అన్నాను.

"కంప కొట్టి కట్టెలమ్మడమే మన బతుకు తెరువ యినప్పుడు ముళ్లు గుచ్చుకోకుండా వుంటాయా?" అని నవ్వాడు.

సూరయ్య మామకు భూమి లేదు. కట్టెల మ్మడం, కూలికి పోవడమే జీవనాధారం.

"ఒరేయ్, దాన్ని చెవుల్లో పెట్టుకుని కొంచెం ఒళ్లు చూడరా," అని స్టైతస్కోపును చూపించాడు.

స్టైతస్కోప్‌లో కాసేపు మామ గుండె శబ్దాన్ని విన్నాను. ఫరవాలేదు గట్టి గుండే!

"ఏమీ లేదంటావా?" అనుమానంగా అడిగాడు.

"ఏమీ లేదు," చెప్పాను. సంతృప్తిగా నావైపు చూశాడు.

బనీను జేబులో చెయ్యి పెట్టి తడుముకున్నాడు. మామ దగ్గర డబ్బు వుండదు. నాకా విషయం తెలుసు.

"ఏమీ ఇవ్వక్కరలేదులే," అన్నాను.

"సరే వస్తా," అని లేచాడు. తలుపు దగ్గరికి వెళ్లి మళ్లీ వెనుక్కొచ్చాడు.

"ఒరేయ్ నాకు తెలియక అడుగుతా, నానా కష్టాలు పడి డాక్టర్ చదువుకొని ఈ వూర్లో ఎందుకురా వైద్యం చేస్తావుండావు?" అని అడిగాడు.

నవ్వి వూరుకున్నాను.

"ఇప్పుడు మీ కొండయ్య తాతే బతికుంటే, నిన్ను చూసి మురిసిపోయేవాడు," అని వెళ్లిపోయాడు.

నాలో ఏవేవో జ్ఞాపకాలు కెరటాలుగా మారి గుండెను తడిచేశాయి.

కొండయ్య తాత - మావూరి మహావైద్యగాడు!

*

మా వూర్లో చాలామందికి తాత వైద్యమంటే కొంచెం నమ్మకం. వేరే మార్గంలేదు కూడా. డాక్టర్ దగ్గరికి పోవాలంటే బండి కట్టుకుని రెండు మైళ్లు పోతే తారు రోడ్డు వస్తుంది. అక్కడ కాచుకుని కూర్చుంటే వీలు చూసుకొని ఏదో ఒక బస్సు వస్తుంది. దాంట్లో ఎక్కి తాడిపత్రి పోయి డాక్టర్‌ని కలవాలి. ఇదంతా ఖర్చు పని. అందుకే పెద్ద రోగమొస్తే తప్ప తార్రోడ్డుకి బండి కట్టరు.

తాత దగ్గర ఒక భూతద్దం వుండేది. భద్రంగా బనీను జేబులో దాచుకునేవాడు. బీడీకి అగ్గిపుల్ల ఖర్చెందుకని దాన్ని భూతద్దంతో అంటించేవాడు. బీడీ లోంచి కొంచెం కొంచెంగా పొగ వస్తుంటే పిల్లలం దరమూ ఆశ్చర్యంగా చూసేవాళ్లం. అది గొప్ప మాయా జాలంలా అనిపించేది. తాత మాంత్రికుడిలా నవ్వి బీడీని గుప్పుగుప్పున లాగి తన మంత్రదండాన్ని భద్రంగా బనీను జేబులో దాచుకునేవాడు.

తాతకి డెబ్బయ్ ఏండ్లు. బక్కపలచని శరీరం. మీసాలు మాత్రం భలే ఎత్తు. గోచి పోసుకొని పంచె కట్టుకొని బనీను మీద తువ్వాలు వేసుకునేవాడు. నేను పసోడిగా వున్నప్పట్నుంచి తాతతో మాంచి దోస్తీ. మా ఇంటిపక్కనే చిన్న కొట్టంలో వుండేవాడు. అది ఎండొస్తే కాలుతుంది. వానొస్తే కారుతుంది.

వైద్యంలో తాతకు నేను అసిస్టెంటుని.

*

మాది అన్యాయమైన వూరు. మనుషులంతా ఎండుచాపల్లాగా వుంటారు. మిట్ట మధ్యాహ్నం కాడ, ఎవరైనా ఇంటికొచ్చి ఇంత ముద్దపెట్టి కాసిని నీళ్లు పోయమంటే గింజాడేవాళ్లం. రెండు రూపాయల బియ్యం వచ్చేవరకూ పండుగలకీ, కర్మలకీ తప్ప వరి అన్నం ఎరగం. జొన్న రొట్టె, జొన్న అన్నం, కొర్రెన్నం, రాగి సంకటి ఇవే మాకు అపురూపం. మాంసం సంగతి చెప్పుకోపనిలేదు.

మా అనంతపురం జిల్లానే కరువుకు పుట్టిండేది. జిల్లాలో మా వూరు కరువుకి మొగరాయుడు. కప్పల పెండ్లికి, విరాటపర్వానికి చినుకులు రాలతాయా! నేను పుట్టకముందు మూడేండ్లు వరుసగా కరువొచ్చిందంట!

వెన్నెల రాత్రుల్లో అందరం అన్నాలు తినేసి మా ఇంటికి ఎదురుగా వుండే వేప చెట్టుకింద కూర్చొనేవాళ్లం. అప్పటికి మావూరికింకా కరెంటు రాలేదు.

"అమ్మీ ఆ బుడ్డీని ఆర్పు. పూసపడినా ఎతుక్కునే ఎన్నెలుంటే అదెందుకు? గబ్బునూనె బలే పిరిం," అని మా అమ్మతో తాత అనేవాడు.

"పెద్దనాయినా నువ్వు కరువుకి సద్దె కట్టేవాడు," అని ఎకసెక్కెం చేసేది మాయమ్మ.

''సింతకాయలమ్మేదానికి సిరిమానమొస్తే, ఇవేంటివమ్మా వంకరటింకర కాయలు అనిందంట సింతకాయల్ని సూసి. నీకు సిరిమానం రానేలేదు. ఎందుకంత జంబం కూతలు? మొగోడు దుమ్ము నాక్కొని తెచ్చేస్తావుంటే నీకేం బుడ్డీని పగలు కూడా అంటిస్తావు.''

"అవుతే మొగోడు దుమ్ము నాకుతా వుండాడు. నేను రాణి మాదిరి తెల్లన్నంలోకి నెయ్యి పోసుకొని తింటా వుండాను. ఎనుముల పేడా వుచ్చా నువ్వెత్తిపోస్తా వుండావా దినరోజూ?''

"పాపా మేంజేసిన కష్టం మీరేం చేస్తారే!" జ్ఞాపకాలను తవ్వుకునేవాడు తాత.

తమలపాకు నములుతూ గంభీరంగా బీడీ దమ్ము లాగి మొదలుపెట్టేవాడు.

ఎనుములు చొప్పదంట్లు కొరుకుతున్న శబ్దం వినిపిస్తూ వుండేది. వీధికుక్క కూడా చెవుల్ని టపటపమని సవరించుకొని తాత చెప్పే విషయాలను వినేది.

"నేను పుట్టి బుద్దెరిగినప్పటి నుంచి మనూర్లో ఎవుడి కల్లమూ గింజలతో నిండంగా సూడ్లా. ఒగసారి వచ్చింది కరువు. మూడేండ్లు ఈడ్చీడ్చి కొట్టింది. అట్లా కరవు ఏడేడు జన్మాలకీ వద్దురా! అప్పుడు నేను మాంచి ప్రాయంలో వుండాను. గాడిద తంతే లబలబలాడే వయసు.

అది వూరుని నాశినంసేసే కరువని సెప్పినాకదా! నాలుగ్గింజలు కనపడితే పానం నాలిక మీదికొచ్చేది. పక్కింట్లో ఇసత్రాయి శబ్దం ఇనపడితే ఈ ఇంట్లో వాళ్లు కుళ్లుకునేవాళ్లు. జొన్నరొట్టెలు కాలిన వాసన తగిలితే ఆ ఇంటికాడకి పోయి ఏందో పని వున్నట్లు తచ్చాడేవాళ్లు. మర్యాదకన్నా కొంచెం పెడతారని ఆశ. వాళ్లు పొయ్యి ఆర్పి రొట్టెలు దాసిపెట్టి ఏం తెలియనట్టు వుండేవాళ్లు.

గవర్మెంటోడు గంజి కేంద్రాలు ఆడపెడతా వుండాడు, ఈడ పెడతా వుండాడు అని అనేవాళ్లు. మనూర్లో ఎపుడూ పెట్టింది లేదు. వూర్లో ఎవడికీ పనీ లేదు, తిండీ లేదు. దర్మారం దిక్కు రోడ్డు పని సిక్కుతా వుందని వూర్లో కొందరు పోయినారు. పోయినోళ్లు పోయినట్టే తిరిగొచ్చినారు. దర్మారమోళ్లకే దిక్కులేదంట!

ఇంగ గొడ్ల బాధ దేవుడికెరుక! దాండ్ల అరుపు ఇనపడితేనే కండ్లలో నీళ్లొచ్చేవి. కొందరు అయినకాడికి కటికోళ్లకి అమ్ముకుండారు.

నేను మాత్రం నా ఎద్దుల్ని అమ్మలా!

ఇట్ల నోటికీ, కూటికీ కన్నవస్తలు పడతావుంటే తాడిపత్రి నుంచి ఒకాయన వచ్చినాడు. బళ్లారిలో నల్ల బండలకి బలే గిరాకీ అని వర్తమానం తెచ్చినాడు. ఆయన మాటలిని వూర్లో వుండే వయసు పిల్లోళ్లంతా తాడిపత్రికి బండ్లు కట్టి ఎలబారినాము. మన తాడిపత్రిలో నల్లబండలు అగ్గువ కదా! ఆడ బండలు తీసుకొని బళ్లారికి ఎలబారినాము.

బళ్లారంటే ఈడలేదు. దగ్గిరదగ్గిర నూరుమైళ్లు. గుత్తి దాటల్లా, గుంతకల్లు దాటల్లా. ఆడ సగం కన్నడం, సగం తెలుగు మాట్లాడతారు. రాగిముద్దలు, జొన్న రొట్టెలు సద్ది కట్టుకొని ఈపొద్దు కోళ్లు కూసే టయింకి తాడిపత్రి ఇడిస్తే రేపు కోళ్లు కూసే పొద్దుకి బళ్లారి వస్తుంది. దోవలో ఎద్దులబాద సూసేకి కాదులే! దాండ్లకి కడుపునిండా మేత యాడ తెచ్చేది? చలకోలతో పయ్యి పగిలితేగాని అవి ముందుకు పోవు. ఎట్లయితేనేం బళ్లారి చేరినాం.

బళ్లారిలో మా తిక్కమొగాలు సూసి రూపాయి సొత్తు పావలాకి అడగబట్టినారు. బళ్లారిలో బండలకి బలే గిరాకీ అని సెప్పిన తాడిపత్రి పెద్దమనిషి అప్పుడు కనిపిచ్చుంటే ఎద్దుల్ని ఇడిపిచ్చి బండికి ఆయన్ని కట్టి వుందుము.

ఇంతలో ఒకాయన మా దగ్గరికి వచ్చి, "ఏ వూరు మనిది," అని అడిగినాడు. సెప్పినాము. ఆయన సంబరపడి, "నేను కూడా మీ పక్కోడినేవాయ్, తాడిపత్రి దగ్గర ముచ్చుకోట నాది," అనినాడు.

"సామీ, మనదేశమంతా కరువు. ఎన్నెన్నో అగ సాట్లుపడి ఈ దేశానికి బండలేసుకొచ్చినాం," అని మా దుక్కం చెప్పుకుండాము. "అయ్యో తిక్కనాయాళ్లారా! బండలేసుకొచ్చి దుడ్లమూటలు తీసుకొనిపోదామని వచ్చినారా! ప్రపంచమంతా యాపారంరా, నేను అమ్మి పెడతా. అయితే రూపాయికింతని కమీషన్," అసలు విషయం బయటపెట్టినాడు ముచ్చోడు.

సరే మనదేశం కాకపోయా, రాలినంత గోవిందా! అనుకొని వాడెంట పోయినాం. వాడు ఒగ ఆసామి దగ్గరికి పిల్చుకొనిపోయి రేటు మాట్లాడి లెక్క ఇచ్చి నాడు. అన్యాయం బేరంకాదు. కూలి గిట్టుకుంది. ఇంటి కాడ కూడు లేక సచ్చేకంటే ఎందో ఒక కష్టం సేసేది మేలు కదా!

అట్ల బళ్లారికి ఐదారుసార్లు పోయినాం. ఒగసారి బళ్లారి నుంచి వచ్చేసరికి నా ఎదమింద నల్లబండ పడి పోయింది. మా ఆడది వాంతి బేది వచ్చి సచ్చిపోయింది. కరువులో అధికమాసమని అప్పుడు మనుషులకి ఒకటే రోగాలు రొస్టులు. పీనిగిని ఇంట్లో పెట్టుకునేకి లేదు. నేనొచ్చేసరికి అంతా అయిపోయింది. మా సేనులో మన్ను సూపించి, 'ఈడనే నీ పెండ్లాం వుండేది,' అని సెప్పినారు."

తాత చెప్పడం ఆపి ఆరిపోయిన బీడీ ముట్టించు కొని రెండు దమ్ములు లాగి గమ్మున వుండిపోయాడు. వెన్నెల్లో తాత మొహం మీది ముడతలు పఁరలు చీలిన నేలను గుర్తుకు తెచ్చేవి. ఆ ముడతల్లో ఎన్నో కరువు కథలు దాగి వుండేవి.

తాత మళ్లీ పెళ్లి చేసుకోలేదు. కొడుకు శంకరుడే లోకం. తాను తింటే విషం, కొడుకు తింటే అమృత మనుకొని పెంచాడు.

శంకరుడుకి చదువు అబ్బలేదు. పెళ్లయింది. నలుగురు పిల్లలు పుట్టారు. తాతకుండేది నాలుగెకరాల భూమి. పంటల సంగతి తెలిసిందే. తాత, శంకరుడు, శంకరుడి భార్య ముగ్గురూ గొడ్డు కష్టం చేసినా సగం కడుపే నిండేది.

ఒకరోజు శంకరుడి బావమరిది వచ్చి, "ఏంది బావా ఈ అగసాట్లు! రాళ్లన్ని ఎన్ని ఏండ్లు దున్నితే గింజలు పండుతాయి? కోయంబత్తూరు మిల్లులో కావల్సినన్ని పనులంటా! మనూరోళ్లు ఆడ వుంటారు. కష్టం సేసేదానికి యాదేశమైతేనేం? పోదాం పద," అని పురెక్కించాడు.

శంకరుడికి పురుగు తొలిచింది. పెళ్లాం బిడ్డలతో కోయంబత్తూరుకి సిద్ధమైనాడు. ఇది తెలిసి తాత నిలువునా నీరైపోయినాడు.

"ఒరే శంకరా వున్నూరు ఇడిసి పోకూడదురా. మనకేం తక్కువా? పంటలు ఈసారి కాకుంటే ఇంకో సారి పండుతాయి. మనమాట కాదు. మన మనుషులు కారు. అరవ దేశంలో బంగారు బువ్వ పెట్టినా మన కొద్దురా," అని చిలక్కి చెప్పినట్టు చెప్పాడు.

"ఏంది నాయినా నువ్వు సెప్పేది. కూడుంటే గుడ్డలేదు. కప్పుకునేకి వుంటే పరుసుకునేకి లేదు. సియ్యలకూర తిని ఎన్నాళ్లయింది. సెప్పు? ఈడ ఎన్నేం డ్లున్నా ఇదే బట్ట. ఇదే బువ్వ. ఈ భోగం నాకొద్దు నాయినా. పోదాంపద. బాగా బతికేదానికి యాడయి తేనేం?"

శంకరుడు మొండికేసినాడు.

"అయితే నువ్వే పోరా శంకరా, అరవకూడు నాకొద్దు నేను ఈడనే వుంటా," అని చెప్పాడు తాత.

వూర్లోవాళ్లు ఎంతెంతో చెప్పి చూసినారు.

"ఈ వయసులో వున్నూరు ఇడిసి ఆ దేశంపోయి నేనేమి పనిచేసేది? భూమికి భారం అయినా ఫరవా లేదు. బిడ్డలకి భారం కాకూడదు. అయినా నేనుపోతే మీకందరికీ వైద్యం ఎవుడు సేస్తాడురా?" అన్నాడు తాత.

శంకరుడు బయలుదేరే రోజు వచ్చింది.

ఆరోజంతా ఏం మాట్లాడకుండా తాత మౌనంగా వున్నాడు.

తాఁరోడ్డుకి బండి బయలుదేరింది. ఆఖరి మను మడిని భుజాల మీదికి ఎక్కించుకొని తాత బయలు దేరినాడు. నేనుకూడా రోడ్డు దగ్గరికి పోయాను.

అర కిలోమీటరు దూరంలో బస్సు వస్తూ కనిపిం చింది. దాన్ని చూడగానే తాత ఒక్కసారిగా వలవల ఏడ్చినాడు. శంకరుడు, అతని భార్య కూడా ఏడవ సాగారు.

పిల్లలు మాత్రం బస్సెక్కే సంబరంలో వున్నారు. బస్సు బయలుదేరేటప్పుడు తాత తన ఆఖరి మను మడిని అక్కున చేర్చుకుని, "వైద్యంలో నిన్ను నా అంతటోడ్ని సేస్తామనుకున్నాను. రుణం లేదు," అని కళ్లు తుడుచుకున్నాడు.

అప్పుడు పోయిన శంకరుడు మళ్లీ సంవత్సరం తరువాత వచ్చాడు. డబ్బులు కడితే పని పర్మినెంట్ చేస్తారని, భూమిని, ఇల్లును అమ్మాడు. తాతకి ఒక కొట్టం, ఒట్టిపోయిన ఎనుము మిగిలింది.

ఆ గొడ్డంటే తాతకి బలే ఇది. పొద్దున్నే లేచి దాని పయ్యి కడిగి మేపుకి తీసికెళ్లేవాడు.

"ఒట్టిపోయిన గొడ్డుకి మేపు దండగ. అమ్మి పారేయ్," అని ఎవరైనా అంటే, "ఇన్నాళ్లూ దాని పాలు

తాగి ఇప్పుడు రొమ్ము గుద్దుతామా? తల్లి ముసల్ది అయిందని సంపుకుంటామా,'' అని తిట్టేవాడు.

ఒకరోజు తాత ఇంట్లో లేడు. ఎనుముకు ఏమైందో ఏమో కాసేపు గిల గిల కొట్టుకొని చచ్చిపోయింది.

తాత వచ్చి దాన్ని చూసి కళ్లల్లో నీళ్లు పెట్టుకొని, "ఇదెంత మోసకారి ఎనుమురా. నేను ఇంట్లో లేనప్పుడు సచ్చిపోయింది. నేను వుండి వుంటే ఏదో ఒక పసరు తాగించి బతికించేవాన్ని,'' అన్నాడు.

పుండులాంటి తాత జీవితానికి వైద్యం ఒక పసరులాంటిది.

*

మా వూరి సంగతి ముందే చెప్పాను. పంటలు లేక కరువొచ్చి చస్తా వున్నా మాకు కొట్లాటలకేమీ తక్కువలేదు. కొట్లాడితే మాకు పోయేదేముంది ఆస్తులా పాస్తులా?

వూర్లో సగం కొట్లాటలకు కారణం నీళ్లు. వూరికంతా మంచినీళ్ల బావి ఒకటే. జీవితంలోని అసహనం, అసంతృప్తి అంతా బావి దగ్గర కొట్లాటల్లో వ్యక్తమయ్యేది.

"ఏమ్మే ఇంటికాడ పిల్లోనికి పాలియ్యాలా ఒగ బిందె సేదుకుంటాను రొంత ఇడుసు,'' అనేది ఒకామె.

"నీకొగదానికే కాదులేమ్మా పిల్లలుండేది మాకూ వుండారు. మేమూ పోవాలా,'' అనేది మరొకామె.

"నేనొచ్చి శానాసేపయింది. మీరే సేదుకుంటా వుంటే మేమూ పోవద్దా. మాకూ సంసారాలు లేవా?''

''ఈయమ్మ పట్టపురాణి వచ్చిందని నీళ్లు ఇడవండి.''

ఈరకంగా ఆడవాళ్లు యుద్ధం ప్రారంభిస్తే మగవాళ్ల తలలు బద్దలు కావడంతో అది ముగిసేది.

నాకు పదేళ్లు వయసుండగా బావి ఎండిపోయింది. బోర్లు వచ్చాయి. కాలంతోపాటు కొట్లాటలు తీరుకూడా మారింది. కర్రలకు బదులు బాంబులు.

మావూర్లో ఒక సాయిబుండేవాడు. ఆయనకి ఆరుమంది పిల్లలు. సెంటు భూమి లేదు. కొన్నాళ్లు నూనె డబ్బా నెత్తిన పెట్టుకుని ఊరూరు తిరిగి అమ్మేవాడు. మరికొన్నాళ్లు కొలిమి పని చేసేవాడు. ఒకసారి రెండు నెలలు పత్తా లేకుండా పోయాడు. జైల్లో పడినాడని చచ్చిపోయినాడని వూర్లో రకరకాలుగా చెప్పుకున్నారు.

పుకార్లని గాలికి రేపుకుంటూ ఒకరోజు సాయిబు వూర్లోకి వచ్చాడు. ఆరోజు నుంచి బాంబులు తయారు చేసేది మొదలుపెట్టాడు. తాడిపత్రి చుట్టుపక్కల కొట్లాటల కోసం కోర్టుల కోసం బతుకతా వుండే పల్లెలు చాలా వున్నాయి. ఆ వూర్లో నాయకులు పదిమంది వెంట లేకుండా దొడ్డికి కూడా పోరు. వాళ్లు గుట్టు చప్పుడు కాకుండా వచ్చి సాయిబు దగ్గర బాంబులు కొనుక్కొని వెళ్లేవాళ్లు.

అప్పుడప్పుడు పోలీసులు వచ్చి సాయిబును తీసుకొనిపోయేవాళ్లు. ఇంతటితో సాయిబు పని అయిపోయిందని అనుకునేవాళ్లం.

ఒక వారం తరువాత సాయిబు వూర్లోకి వచ్చేవాడు. "మన ఎనక ఎవరూ లేరనుకుంటారు. తాడిపత్రి పెద్దరెడ్డి వచ్చి ఈ సాయిబు మనోడేరా అనేసరికి పోలీసోళ్లు వుచ్చ పోసుకుని ఇడిసిపెట్టినారు'' అని మీసం మెలేసేవాడు.

"కుంటుతా వుండావేం,'' అని అడిగితే "సింత పండు పడగొట్టినారు నా కొడుకులు,'' అని నవ్వేవాడు.

ఒకరోజు ఉదయాన్నే మేము జొన్నరొట్లు తినుకుంటూ కూర్చుని వున్నాము. ఊరు అదిరిపోయే శబ్దం వినిపించింది. అందరం పరిగెత్తినాం. ఊరి బయట వుండే సాయిబు ఇల్లు కూలిపోయి వుంది. అక్కడంతా నల్లటి పొగ వ్యాపించి వుంది. సాయిబు తయారు చేస్తున్న బాంబులు పేలిపోయాయి.

అప్పుడు చూసిన దృశ్యాన్ని ఎప్పటికీ మరిచిపోలేను.

సాయిబు పెద్ద కొడుకు పదారేళ్లవాడు. నాకంటే రెండేళ్లు పెద్ద. ముక్కలు ముక్కలుగా తెగిపోయి వున్నాడు. ఇంటిముందున్న జామిచెట్టుకు వాడి తెగిపోయిన కాలు వేలాడుతూ వుంది. వాడి పేరు కరీం. దీపావళి పండగంటే బలే సంబరం వాడికి! మా ఇంట్లో ఒక రూపాయి డబ్బులిస్తే దానికి తాడిపత్రి నుంచి ఒక కాకరపూల పాకెట్ తెప్పించుకుని అపురూపంగా కాల్చేవాళ్లం. వాడు మాదగ్గరే నిలబడి తనకొకటి ఇవ్వమని బతిమాలేవాడు. సగం కాలిన కడ్డీని చివర్లో ఇచ్చేవాళ్లం.

"ఎప్పుడూ ఇవేనా? ఢాం అని పేలే టపాకులు తెచ్చుకోండి,'' అనేవాడు.

సాయిబు కొనప్రాణంతో కొట్టుమిట్టాడుతున్నాడు. అతని పెళ్లాము, మిగిలిన పిల్లలు వూర్లోకి పోవడంవల్ల బతికిపోయారు. ఆమె పిల్లలతో కలిసి "మేము ఇంకెట్లా బతికేది సామీ,'' అని ఏడుస్తా వుంది.

సాయిబు ఒళ్లంతా కాలిన గాయాలు. కుడి చెయ్యి తెగి దూరంగా పడి వుంది. వేళ్లు కాలి తెగిపడిన చెయ్యి భయంకరంగా వుంది. సాయంకాలాల్లో ఆ వేళ్ల తోనే సాయిబు పిల్లనగోవి వాయించేవాడు. పిల్లలందరం చుట్టురా చేరి సుతారంగా కదిలే వేళ్లవైపు చూసేవాళ్లం.

మూలుగుతున్న సాయిబును చూసి, ''తాడిపత్రికో, అనంతపురానికో తీసుకొనిపోతే బతుకుతాడేమో,'' అన్నాడు తాత.

''బతికేది కష్టం తాతా. పోలీసు కేసులో అన్యాయంగా ఇరుక్కుంటాం,'' అన్నారు ఒకరు.

''ఒరే నాయనా! మన ప్రయత్నం మనం చేయాలా! భూమ్మీద ప్రాణం సమానమైంది లేనే లేదురా. నేను ముసిలోడిని. నేను భయపడేది సావుకి ఒగదానికే. పోలీసోళ్లు పట్టుకొనిపోతే ఈ వయసులో కష్టం లేకుండా తిండన్నా దొరుకుతుంది,'' అని బండి కట్టి సాయిబును వేసుకొని తార్రోడ్డుకి బయలుదేరినాడు తాత.

తాత మాటలకి రోషమొచ్చి వూళ్లో వాళ్లు కూడా నలుగురైదురుగు బయలుదేరినారు. డాక్టర్లు అడిగితే బాయికాడ తూటాలు పగిలినాయి అని చెప్పాలని నిర్ణయించుకున్నారు.

గంట సేపటికే బండి తిరిగొచ్చింది.

అందరం చుట్టూ మూగాం.

''ప్రాప్తం లేదురా,'' అని కళ్లు తుడుచుకున్నాడు తాత. సాయిబు శవాన్ని హడావుడిగా పాతిపెట్టేరు. బాంబుల శబ్దం చుట్టూ వుండే నాలుగూళ్లకి వినపడి వుంటుంది. ఏ క్షణాన్నైనా పోలీసులు రావచ్చు. అదీ భయం!

అనుకున్నట్టుగానే చీకటి పడేవేళకి పోలీసు జీపు వచ్చింది. కంచాలకాడ అన్నాలు విడిచిపెట్టి వూర్లో వుండే మొగోళ్లంతా వూరవతల కొండమీదకి పారిపోయారు. ఆడోళ్లు, ముసిలోళ్లు, పిల్లలుమాత్రం మిగిలాం.

పోలీసులొచ్చి సాయిబు పెళ్లాన్ని నానా ప్రశ్నలు వేశారు. అన్నిటికి ఆమె ఏడుపే సమాధానం. పోలీసులు ఇల్లిల్లూ వెతికినారు. నానా తిట్లు తిట్టారు.

మరుసటి రోజు వూర్లో పోలీసు క్యాంపు పెట్టారు. వూరి బయట టెంట్‌వేసి నలుగురు పోలీసులు తుపాకులతో కూర్చున్నారు. రెండురోజుల్లో వూర్లో కోళ్లన్నీ తినేశారు.

మా తాత దగ్గర బ్రహ్మాండమైన కోడిపుంజు వుండేది. కూత కూసిందంటే తెల్లారినట్టే లెక్క! ఎర్రటి ఈకలు, నెత్తిమీద కిరీటం! వూర్లో వుండే పెట్టలన్నింటితో గుడ్లు పెట్టించేది.

పిల్లగా వున్నప్పుడు దాన్ని కొనుక్కుని పెంచుకున్నాడు. అది కొంచెం పెద్దదై, దాని నెత్తిమీద జుట్టు మొలిచేసరికి తాత మీసం మెలేసాడు.

''మనం పుంజుకు సమానమైంది సుట్టూరా పదూర్లలో వుండకూడదు,'' అని దాన్ని మేపేవాడు. దానికి చెనిక్కాయ విత్తనాలు తినిపించేవాడు. తాత అరచెయ్యే పుంజుకు కంచం. పిడికిటి నిండా జొన్నలు తీసుకొని పుంజును చంకలో అదమబెట్టి దాని నోరు తెరిచి కొంచెం కొంచెంగా పోసేవాడు. దాని గొంతును సున్నితంగా సవరిస్తూ చిప్పతో నీళ్లు తాగించేవాడు. ఎవరింట్లోనైనా తేలును చంపితే దాన్ని ఒక పుల్లతో తీసుకొని వెళ్లి పుంజుకు చూపించేవాడు. దానికోసం పుంజు 'కొక్కొక్కో,' అని మారం చేసేది. తేలును ఇవ్వకుండా దాన్ని కాసేపు ఏడిపించి చివరికి దానిముందు వేసేవాడు. అది ముక్కుతో పొడిచి తింటూ వుంటే తాత దాన్ని సంబరంగా చూస్తూ, ''మన పుంజుకు ఇవాళ మాంచి తిండి,'' అనేవాడు.

అటువంటి పుంజుకు ఇప్పుడు కష్టకాలమొచ్చింది. పోలీసుల సంగతి తెలియగానే దాన్ని గంప కింద మూసిపెట్టాడు తాత.

పోలీసు క్యాంప్ పెట్టిన మూడోరోజు ఒక మీసాల పోలీసాయన తాత దగ్గరికి వచ్చాడు. ఒక చేతిలో లాఠీ, భుజానికి తుపాకీ వుంది.

''ముసిలాయనా, కోళ్లు వుండాయా? వూరికే వద్దు లెక్క ఇస్తాను,'' అడిగాడు దర్పంగా.

తాత అమాయకంగా మొహం పెట్టి, ''కోళ్లు యాడుండాయి సారూ. వుంటే మీకు లేదంటానా? కోడి తిని సంవత్సరమైంది. పోయిన మాలపున్నమికి తినిండేదే!'' అన్నాడు.

గంప కింది కోడి పరపరమని గీకుతా వుంది. పోలీసాయన అది గమనిస్తాడేమోనని తాతకి ఒకటే ఇదిగా వుంది.

''ఇదేం వూరయ్యా. కోళ్లు కూడా లేవు,'' విసుక్కున్నాడు పోలీసు.

''వుండేటివన్నీ మీరే తినేస్తిరి కదా సారు. ఆ మోట్లో వుండే ఇంట్లో కోళ్లు వుండాలా సూడు పో సారు,'' పోలీసుని తొందరగా వదిలించుకోడానికి ప్రయత్నించాడు తాత.

పోలీసు వెళ్లబోయాడు. కాని పుంజుకు రోజులు బాగా లేవు. 'కొక్కొక్కో,' అని చావుని పిలిచింది.

పోలీసాయన ఆత్రంగా వచ్చి గంప తీసి పుంజును చూశాడు. ''ఓర్నీయమ్మా! పహిల్వాన్ మాదిరుందే! ముసిలోడా, నా దగ్గరే అపద్దాలు చెబుతావా?'' గర్జించాడు.

తాత పోలీసు చేతిలోని పుంజును గబాలున లాక్కొని వదిలిపెట్టాడు. అది ఎగురుతూ పోయింది.

''సారూ! బిడ్డని సాకినట్టు సాకినా దాన్ని. దాని జోలికి మాత్రం రావద్దు,'' దీనంగా అన్నాడు.

'ముసిలోడా నువ్వేం వూరికే ఇస్తావా? జాస్తి మాట్లాడుతుండావే? ముందే కోడిని నాకు చూపించి ఇదిగో సారూ, కోడికి ఇంతయితుంది అని అడుగుంటే ఇరవై కాని ముప్పయ్ కాని ఇచ్చుండేవాడ్ని. మర్యాదగా ఇస్తావా? తుపాకి గుండేసి కాల్చి తీసుకుని పొమ్మంటావా?'' బెదిరించాడు పోలీసు.

తాత దెబ్బతిన్న పక్షి అయిపోయాడు.

''సారూ! బీదోళ్ల సొమ్ము తింటే కడుపుకు అంటదు,'' అన్నాడు.

''ముసిలాయనా కోడిని ఎన్నాళ్లు మేపినా పంటి కిందకే కదా! కాలంతీరి న్యాయంగా సచ్చిపోయిన కోళ్లని ప్రపంచంలో యాడన్నా సూసినావా?'' అని పోలీసాయన కోడిని తిప్పలాడినాడు.

''యాడన్నా ముండ మోయించుకో నీకు సేరు ఉప్పు తినేవాడు చెప్పాలా. నా కోడి తింటే గొంతుకి ఎముక అడ్డంపడి సస్తావు,'' శాపనార్థాలు పెట్టాడు తాత.

''భూమ్మీద నీకే కోడి వున్నట్టు మాట్లాడుతాం డావే! మాటలేం జోరుగా వస్తుండాయి. లాఠీతో ఒకటి కొడితే నీళ్లు అడక్కుండా సస్తావు. మోసేదానికి మీ వూర్లో మొగోళ్లు కూడా లేరు,'' అంటూ మీదికొచ్చాడు పోలీసు.

ఇదంతా చూస్తున్న నాకు కడుపు మండిపోతోంది. కాని చిన్నవాడ్ని ఏం చేయగలను?

''పాపం పుణ్యం దేవుడు సూస్తాడులే పోలీసాయనా... నా కోడిని పట్టుకునేకొచ్చి నన్నే కొడతానంటా వుండావు,'' అక్కసుగా అన్నాడు తాత.

ఈమాటలు పట్టించుకోకుండా కోడిని ముప్పు తిప్పలు పెట్టి పట్టుకొని చంకలో పెట్టుకొని అదేపోత పోయినాడు పోలీసు.

తాత మౌనంగా యోగిలా చెట్టుకింద కాసేపు కూర్చున్నాడు. ఉన్నట్లుండి పైకి లేచాడు. విసవిస కొట్టంలోకి పోయి కోడికి ప్రతిరోజూ నీళ్లు తాగించే టెంకాయ చిప్పను తీసుకొని వచ్చి బలంకొద్దీ విసిరేశాడు. అది కంప చెట్ల మీదుగా వెళ్లి ఒక రాయిమీద పడి టప్‌మని ముక్కలైంది.

''కడుపులో పుట్టిన కొడుకే లేకుండా పాయ. ఇంగ కోడిదేముంది?'' అని దుఃఖంతో గొణుకున్నాడు తాత.

*

మరుసటి రోజు ఉదయాన్నే నేను, తాత చేతిలో సంచులు పట్టుకొని బయలుదేరినాము. సంచిల్లో జొన్న పిండి, మిరపకాయలు వున్నాయి. కొండపై నుండే మా వాళ్లకి అవి అందియ్యాలి.

కొండకి పోలీసు టెంట్ మీదుగానే పోవాలి. మేము పోతూ వుంటే మీసాల పోలీసాయన పిలిచాడు. తాత అతనివైపు కూడా చూడలేదు. దీంతో ఆయనే వచ్చాడు.

''ఇదిగో ముసిలాయనా నీ కోడిని తిన్నానని కోపం పెట్టుకోమాకు. నేను పోయేలోపల నీ కోడి లెక్క ఇస్తాను. మాట వరసకి అడుగుతాను. నువ్వు మంచి వైద్యగాడంటనే?'' అన్నాడు పోలీసు.

ఆ మాటకి తాత ముఖం కొంచెం వెలిగింది.

''సుట్టూరా పదూర్లలో దీపాలు పెట్టే యాలకి మన పేరు తలుసుకుంటూరు,'' అన్నాడు గర్వంగా.

''ముసిలాయనా నాకో జబ్బుండాది. ఇష్టాన్నం తిన్నా, తినింది ఆలస్యం చెంబు పట్టుకొని పోవాల్సిందే. ఏందన్నా మందియ్యి సామీ,'' అన్నాడు పోలీసు.

''అదేం భాగ్యం. సాయంత్రం గాడిదాకు పసరిస్తాను. తాగుదువుగాని. ఒగమాట గాడిదాకు దొరకాల్లంటే సేనంతా ఎతకాల. నువ్వు మీ నేస్తగాల్లకీ ఈ పసరు విషయం సెప్పొద్దు. వాళ్లు కూడా పసరు కావాల్లంటే నాకు కష్టం. ముద్ద ముద్దకి బిస్మిల్లా అనాలంటే నాతో కాదు. సాయంత్రం పిల్లి మాదిరొచ్చి నా కొట్టంకాడ పసరుతాగి మూతి తుడుచుకొని ఫో అంతే,'' ఉత్సాహంగా చెప్పాడు తాత.

అక్కడినుంచి ఇద్దరం కొండకి బయలుదేరినాం.

''తాత, గాడిదాకు పసరు, పశువులకి కదా తాగించేది,'' అని అడిగాను.

''ఈ పోలీసోడు కూడా పసరమేలే, ఇదెంత అన్యాయం సూడరా, పాపమని పాలుపోస్తే, ఎన్నపూసలో వేలు పెట్టినట్టు కోడి నేనే ఇచ్చి అది అరిగేకి మందు కూడా నేనే ఇయ్యాల్నా? తినిన నా పుంజును, వాడితో ఏరిగించకుంటే నాపేరు కొండయ్యే కాదు,'' అన్నాడు.

మావాళ్లకి దినుసులు ఇచ్చి వచ్చేటప్పుడు చేనులో గాడిదాకు కోసేదానికి దిగినాం. ''తాతా గాడిదాకు ఎక్కువగా వున్నట్లు లేదే,'' అన్నాను.

''ఎత్తిపోయే సంసారానికి ముందు కుడికాలైతేనేం? ఎడమ కాలయితేనేం? కంటికి కనిపించిన ఆకు కోసి పారెక్కు,'' అన్నాడు.

సాయంత్రం పోలీసాయన కుశాలగా వచ్చి పసరు తాగిపోయినాడు.

ఆరోజు రాత్రి తాత నన్ను నిద్రలేపి, ''ఈపాటికి పోలీసోడి ముడ్డి పంచరయ్యుంటుంది కదా?'' అని అడిగాడు.

''సామీ, నీ సంబరం సంకనాకనీ, నన్నెందుకు నిద్రలేపుతావు,'' అని విసుక్కున్నాను.

''దెయ్యం పట్టినప్పుడే చెప్పుతో కొట్టాలా,'' అని పడుకున్నాడు.

*

మరుసటిరోజు తెల్లారగానే పోలీసు టెంట్ దగ్గరికి వెళ్లాము. మీసాల పోలీసు కనిపించలేదు.

"మీసాలాయన లేడా సారు?" అక్కడున్న మరో పోలీసుని అడిగాడు తాత.

"వాడి కత చెప్పుకో పనిలేదు," అన్నాడు ఆ పోలీసు.

"ఏమైంది సారూ?" అడిగాడు తాత.

"రాత్రి ఏమి తిన్నాడో ఏమో. ఒకసారి చెంబు తీసుకుని కంపల్లోకి పోయాడు. వచ్చి అట్ల కూర్చుండాడో లేదో మళ్లా చెంబు తీసుకొని పరిగెత్తినాడు. మూడోసారి చెంబు తీసికొనిపోయే టైం కూడా లేదు. టెంటు అంతా గబ్బు పట్టించినాడు. నాలుగు బిందెల నీళ్లు కొడితేగాని వాసన వదలలేదు. రాత్రంతా తూము పారినట్లు పారిందిలే! చీకట్లోనే లేచి తాడిపత్రికి పోతానని ఎల్లబారినాడు. తాల్రోడ్డు వరకూ నేనే వదిలిపెట్టినా. అక్కడికి పోయే లోపల రెండు మూడుసార్లు అయింది. బస్సులో ఏమేమి అగసాట్లో!!" అని గట్టిగా నవ్వాడు ఆ పోలీసు.

మాకిద్దరికీ నవ్వి నవ్వి కడుపు కుట్టు పట్టుకుంది.

"తాతా పోలీసాయన ప్రాణాలకేం అపాయం లేదు కదా?" అని అడిగాను.

"ఏం వాయ్ నేను నీ కండ్లకు ఎట్ల కనపడతా వుండాను. పగోడు వచ్చినా ధైర్యముంటే ఎదురుగా పోయి కొట్లాడాలా! అంతేకాని మందుపెట్టి సంపుతామా? వాడికేం కాదు. సంచి దులిపినట్టు దులుపుతుంది అంతే. అన్యాయంగా నా కోడిని తిన్నాడే మనం ఈ మాత్రమైనా చేయకుంటే ఎట్లా?" అని గట్టిగా నవ్వాడు.

ఆరాత్రి నన్ను నిద్రలేపి, "పోలీసోడికి రోగం కుదిరిస్తిని కదా?" అన్నాడు.

ఈసారి నేను విసుక్కోలేదు. కడుపు పగిలేలా నవ్వాను.

*

ఆ మరుసటిరోజే వూర్లో పోలీసు క్యాంప్ ఎత్తేసారు. ఎలక్షన్లు రావడంతో కేసు కూడా లేకుండా పోయింది.

కొండమీది నుంచి మావాళ్లు బూమ్మీదికి దిగారు. పోలీసాయన పారుడు వ్యవహారం వూర్లో చెప్పుకొని చెప్పుకొని నవ్వుకుండారు.

ఒక నెల తరువాత మా వూరోళ్లది పెళ్లి వుంటే నేను తాతా తాడిపత్రికి పోయాం.

మెయిన్ రోడ్డులో పోతా వుంటే, "ముసలాయనా," అని ఎవరో పిలిచినట్టయింది.

ఎదురుగా మీసాల పోలీసాయన!

వులిక్కిపడి చూడనట్టుగా వెళ్లిపోవాలనుకున్నాం.

పోలీసాయన గబగబా వచ్చి తాత చెయ్యి పట్టుకొని, "నన్ను కనుక్కోలేదా?" అన్నాడు.

తాత కళ్లకి చెయ్యి అడ్డం పెట్టుకొని చూస్తూ, "ఈ నడుమ సూపు సరిగాలేదు సాపోడా!" అన్నాడు.

"మీ వూర్లో పసరు తాగించినావే. ఆ పోలీసోన్ని," అన్నాడు.

"నువ్వా నాయినా బాగుండావా?" అని అడిగాడు తాత. ఎలాగూ దొరికిపోయామన్న ధీమాతో.

"నీ ఫోటోకి పటం కట్టించి పూజ చేసుకుంటా సామి. నా రోగం బాగు చేసినావు. పసరు తాగిన తరువాత రెండు రోజులు దుమ్ము లేపిందిలే. నీ కోడిని తిన్నాననే కోపం మనసులో పెట్టుకుని నాకేదో చేసినావని భయపడినాను. తరువాత కడుపు రాయి మాదిరి బిగుసుకుంది. ఇప్పుడేమి తిన్నా భయం లేదు. రోజుకి ఒకపూట పోతే చాలు," ఆనందంగా చెప్పాడు పోలీసు.

తాతా నేనూ ఇద్దరమూ ఆశ్చర్యపోయాం.

"ఇదిగో ముసలాయనా ఒకరి సొత్తు అన్యాయంగా తినేవాడిని కాదు. ఈ ముప్పయ్ రూపాయలు తీసుకో నీ కోడి ఖరీదు," అని మూడు పది రూపాయల నోట్లు తీశాడు.

"లెక్క ఎందుకులే పోలీసాయనా, రోగం బాగైంది అంతే చాలు," అన్నాడు తాత.

"అయ్యో నీ రుణం నాకెందుకు సామీ," అని బలవంతంగా తాత చేతిలో డబ్బు పెట్టాడు పోలీసు.

"ఒరేయ్ నాయినా పెద్దోడ్ని ఒగమాట సెపుతాను ఇంటావా?" అన్నాడు తాత.

"మా నాయన లాంటివాడివి మంచే చెపుతావు కాని చెడు చెపుతావా?" అన్నాడు పోలీసు.

"పదిమంది వుసురు కొట్టుకుని తినే తిండి ఎప్పటికీ అరగదురా. ఆ శాపం నీకే కాదు. నీ బిడ్డలకి కూడా తగులుతుంది. ఇంకైనా బుద్ధితో బతుకు," అని చెప్పి ముందుకు నడిచాడు తాత.

కాసేపు ఏమీ మాట్లాడకుండా గమ్మున వుండి "మన వైద్యం పవరు సూడరా. సెడ్డ సేసేకిపోయినా మంచే జరిగింది," అని చేతిలోని ముప్పయ్ రూపాయలను చూసి, "మాంచి మిల్ట్రీ హోటల్ యాడుందో సూడరా సియ్యల కూర తిని శానా దినాలయ్యింది," అన్నాడు.

మిల్ట్రీ హోటల్లో మాంసంతో భోజనం చేశాం.

"మన కోడి ఈరకంగా ఋణం తీర్చుకుంది సూడరా," మాంసం ముక్కని ఆప్యాయంగా నములుతూ అన్నాడు తాత.

తాత భోజనాన్ని ఎంత ఇష్టంగా తింటాడో చూసి తీరాలి. అదొక మహా కావ్యం. ఒకే ఒక రాగి ముద్ద వండుకుంటాడు. చెనిక్కాయల ఊరిమిండి నూరుకుంటాడు. రెండు పచ్చి మిరపకాయలు, ఒక ఎర్రగడ్డ తీసుకొని అన్నీ కంచుపళ్లెంలో వడ్డించుకుంటాడు. రాగి సంగటిని కొంచెంగా తీసుకొని ఊరిమిండిలో అద్దుకొని నోట్లో పెట్టుకుంటాడు. పచ్చి మిరపకాయని కసుక్కున కొరికి నములుతాడు. సగం నమిలిన తరువాత ఎర్ర గడ్డను కొరుక్కుంటాడు. ఒకే ఒక రాగి సంగటి ముద్దతో అరగంట భోజనం చేస్తాడు. అంతా అయిన తరువాత వేళ్లను ఇష్టంగా నాకుతాడు. తరువాత ఒక వేలితో పళ్లాన్ని శుభ్రంగా తుడిచి దాన్ని నోట్లో పెట్టుకుంటాడు. అప్పుడు చెయ్యి కడుక్కుంటాడు. నిజానికి పళ్లెంను కడిగే పనిలేదు. అయినా ఒక చెంబు నీళ్లతో దాన్ని శుభ్రంగా బూడిదవేసి కడుగుతాడు (మా వూళ్లో ఒక పళ్లెం కడగడానికి గ్లాసు నీళ్లకంటే ఎక్కువ వాడరు. నీళ్లు కరువు కదా). పళ్లెంలో తన నీడ చూసుకొని దాన్ని గోడకి ఆనిస్తాడు.

తాత సంవత్సరానికి రెండుసార్లు సారాయి తాగేవారు. పీర్ల పండుగకీ, మాల పున్నమికీ. పీర్ల పండుగ నాడు చూడాలి ముసిలోడి జబర్దస్తీ! తప్పెట కొట్టేవాడి చేతులు పడిపోయేవి కాని తాత చిందులు మాత్రం ఆగేవికావు. తరువాత పెద్ద పెద్ద బండరాళ్లని, ఆంజనేయుడు సంజీవి పర్వతాన్ని ఎత్తినంత సులభంగా ఎత్తి పడేసేవాడు.

"పెళ్లాల పక్కన పడుకుని పిల్లల్ని కనేది మొగతనం కాదురా. ఆ పని కుక్కలు కూడా సేస్తాయి. ఈ వూర్లో మొగోడెవరైనా వుంటే నాతోపాటు ఈ రాయిని ఎత్తమను," అని సవాల్ చేసేవాడు.

ఆ రాత్రి వూర్లో చాలామందిని యుద్ధానికి పిలిచేవాడు. పైసా ఖర్చు లేకుండా ఆ రోజు వూర్లో వాళ్లందరికీ వినోదం.

తాత బలే కష్టజీవి. పనుల కాలమొచ్చినప్పుడు చేన్లలో కూలికి పోయేవాడు. వయసోళ్లతో సమానంగా పని చేసేవాడు. తాత పనిలోకొస్తే అందరికీ ఉత్సాహంగా వుండేది. పనిచేస్తూ రాయబారం పద్యాలు అద్భుతంగా పాడేవాడు. వయసులో వున్న ఆడపిల్లలతో సరసాలాడేవాడు.

"ఏం పిల్లా, పెండ్లయి రెండేడ్లయినా పిల్లోళ్లు లేరు. నీ మొగుడ్ని నా దగ్గరకు పంపు. మోకాళ్ల సత్తువకి మంచి మందిస్తా," అనేవాడు.

"ఏం పిల్లా నన్నుంచుకుంటావా?" అని మరో పిల్లని వుడికించేవాడు.

"వుంచుకుంటే నాకేం సొమ్ములు చేయిస్తావు?" అడిగేది ఆ పిల్ల.

"బీదోన్ని నాతో కాదులే తల్లీ," అనేవాడు.

"ఎనకటికి నీలాంటొకడు పిల్ల వూరికే వస్తుందంటే నేనూ నా మనమడు రెడీ అన్నాడంట. సొమ్ము ఇయ్యాల్సి వస్తుందంటే నేను ముసిలోడిని, నా మనుమడు పసోడు అన్నాడంట," అని ఆ పిల్ల ఏదో కత చెప్పేది.

వ్యవసాయం పనులు లేనప్పుడు తాత కట్టెలు కొట్టేవాడు. కట్టెలకి గిరాకీ లేనప్పుడు వాటిని కాల్చి బొగ్గులు చేసి అమ్మేవాడు.

కట్టెలు కాల్చి బొగ్గులు చేయడం బలే తలనొప్పి పని. మట్టితో బట్టీ తయారుచేసి కట్టెలు కాల్చాలి. వాటిని అప్పుడప్పుడు చూసుకుంటూ వుండాలి. లేదంటే కట్టెలు పూర్తిగా కాలి బూడిదైపోతాయి. నేను తాత బట్టీ దగ్గర కునికిపాట్లు పాడేవాళ్లం. తాత ఎన్నెన్నో కథలు చెప్పేవాడు. అన్ని కథల్లో అంతర్లీనంగా వుండే సారాంశం ఒకటే- మనుషులు మనుషుల మాదిరే బతకాలని.

*

నేను పదో తరగతి ఫస్టున పాసయ్యాను. ఇంటర్ చేరాలంటే తాడిపత్రి పోవాలి. మా పక్క వూరయిన 'యాటికి'లో హైస్కూల్ వుండేది. మూడు మైళ్లు నడిచి వెళ్లి చదువుకున్నాను. తాడిపత్రి పదైదు కిలోమీటర్ల దూరం నడవడం సాధ్యం కాదు. తాడిపత్రిలోనే వుండి చదువుకోవాలి. ఖర్చు పని. అయినా మా నాయన నన్ను చదివించడానికే నిశ్చయించుకున్నాడు.

నేను తాడిపత్రికి పోయేరోజు తాత నన్ను పిలిచి, "మీ నాయన్ని పసోడిగా వున్నప్పటి నుంచి నేను చూస్తా వుండాను. వాడికి తీపి పదార్థాలంటే శానా ఇష్టం. పెళ్లిళ్లు, శుభకార్యాలకి పోతే అక్కడ లడ్డో, మైసూరు పాకో పెడతారు కదా, ఒక్కటి కూడా నోట్లో పెట్టుకునేవాడు కాదు. ఒగ కాయితంలో దాండ్లని కట్టుకొని ఇంటికి తెచ్చి మీకు ఇచ్చేవాడు. తన నోరు కట్టుకుని మిమ్మల్ని సాకినాడు. మీ నాయిన నెత్తురు సుక్కలు బొటబొట రాలితే అవి రూపాయి బిల్లలయితాండాయి. ఇది మనసులో పెట్టుకుని సదువుకో. వూరికీ, ఇంటికీ అపకీర్తి తేవద్దు," అన్నాడు.

నేను కళ్లనీళ్లు తుడుచుకుని తాడిపత్రికి వెళ్లిపోయాను. తరువాత మూడు నెలలపాటు మా వూరికి రావడానికి కుదరలేదు. ఒకరోజు మా సూరయ్యామామ బజారులో కనిపించి, "కొండయ్యతాత ఆరోగ్యం ఏమీ బాగోలేదురా, రేయింపగలు ఒకటే దగ్గు," అని చెప్పాడు.

నేను వెంటనే వూరికి వెళ్లాను.

తన కొట్టంలోని కుక్కిమంచంలో కూర్చుని వున్నాడు తాత.

నన్ను చూడగానే, "ఏంవాయ్ ఎప్పుడొచ్చావు?" అని పెద్దగా దగ్గాడు. మనిషి చిక్కిపోయి వున్నాడు.

"ఆరోగ్యం బాగాలేదంటనే?" అన్నాను.

"వయసయిపోయింది కదా," నవ్వడానికి ప్రయత్నించాడు. కనేల్, కనేల్‌మని దగ్గు వచ్చింది.

'మందు తీసుకుంటున్నావా తాతా?" అని అడిగాను.

"ఇదేం కాదులేరా, పసురు తాగితే పోతుంది. తాడిపత్రి సంగతులు చెప్పు?" మాట మార్చడానికి ప్రయత్నించాడు.

"ఇది నీ పసరుకు తగ్గే జబ్బు కాదు," అన్నాను.

"తిక్కలోడి మాదిరి మాట్లాడద్దు. నాకంటే వైద్యగాడు వుండాడా?" అన్నాడు డాంబికంగా.

"మొండిమాటలు మాని తాడిపత్రికి బయలుదేరు. డాక్టర్ దగ్గర చూపించుకుందువు," కోపంగా అన్నాను.

తాత ఏమీ మాట్లాడకుండా బీడీ ముట్టించుకున్నాడు. ఒక దమ్ము లాగేసరికి దగ్గుతో వుక్కిరిబిక్కిరై పోయాడు. బీడీ ఆర్పి గాజుకళ్లతో కాసేపు శూన్యంలోకి చూసి, "నాకొచ్చిన జబ్బు నా పసరుకి తగ్గేది కాదని నాకు తెలుసు. అయినా తాడిపత్రికో, అనంతపురానికో పోయి పెద్ద పెద్ద డాక్టర్లతో సూపించుకునేంత లెక్క యాడుంది నా దగ్గర?" అని నిదానంగా అన్నాడు.

"వూరు సచ్చిపోయిందా," ఆవేశంగా అన్నాను.

"నీకు తెలియదు. చిన్నవాడివి, వుడుకురక్తం. వూర్లో అందరి సంసారాలు అంతంతమాత్రమే. అయినా బతికినంతకాలం ఒక నరమానవుడిని కూడా ఆశించకుండా బతికిన నన్ను పోయే ముందు వూరికి భారం కామంటావా?" అన్నాడు.

నాకేం మాట్లాడాలో తెలియలేదు.

ఆ రాత్రంతా నాకు నిద్రలేదు. తాత దగ్గు భయంకరంగా వినిపిస్తూనే వుంది.

"అమ్మా! తాత పరిస్థితి ఏం బాగోలేదే?" అని మా అమ్మతో అన్నాను.

"ముసిలోడు గొప్ప అభిమానస్తుడు. ఎప్పుడైనా ఇంత కూర ఇస్తేనే తీసుకునేవాడు కాదు. ఈరోజు వూర్లో వాళ్లు సాయం సేసేదానికొస్తే వొప్పుకుంటాడా?" అంది.

*

తరువాత నెలరోజులు గడిచాయి. మనిషిని తాడిపత్రిలోనే వున్నా నా గుండె వూర్లోనే కొట్టుమిట్టాడుతూ వుండేది. ప్రతిరోజూ తాత గుర్తుకు వచ్చేవాడు.

ఒకరోజు సాయంత్రం సూరయ్యమామ వచ్చి, "మీ తాత పానం రోజుల్లో వుండాది. నిన్ను సూడాలని తనకలాడతా వుండాడు," అని చెప్పాడు. దుఃఖంతో వూరికి పరిగెత్తాను.

నేను వెళ్లేసరికి తాత కొట్టం బయట మా అమ్మ, ఇంకో నలుగురైదుగురు ఆడవాళ్లు కూర్చుని వున్నారు.

నన్ను చూడగానే మా అమ్మ కళ్లు తుడుచుకుంది.

కొట్టంలోకి వెళ్లాను. కిరసనాయిలు బుడ్డీ మసగ్గా వెలుగుతూ వుంది. మంచం మీద తాత వున్నాడు. తోలు, ఎముక మాత్రమే వుంది వొంటిపై. నా పసితనంలో ప్రతి సంఘటనతో ముడిపడి వున్న తాతను ఆ స్థితిలో చూసేసరికి నాకు ఏడుపు ఆగలేదు. నా అలికిడి విని కళ్లు తెరిచి చూశాడు. ఆ కళ్లల్లో చిన్న మెరుపు.

"ఏంవాయ్ వచ్చావా? నిన్ను సూడకుండానే యమభటులొస్తారేమో అనుకున్నా," అని దగ్గరికి పిలిచాడు.

నేను పక్కనే కూర్చున్నాను.

"బాగా సదువుతా వుండావా?" అడిగాడు.

తల వూపాను.

దిండు కింద చెయ్యి పెట్టి తడిమి ఒక గుడ్డ మూట తీశాడు. అది నా చేతికిస్తూ, "దీంట్లో కొంచెం లెక్క వుండాది. నేను పోయినానని తెలిస్తే శంకరుడు వస్తాడు. దూరాభారం ఖర్చులెక్కువ. నలుగురు పిల్లలతో ఎట్ల బతకతా వుండాడో ఏమో. ఛార్జీలకైనా వస్తుంది. ఇది వాడికి ఇయ్యి," నిదానంగా వూపిరి ఎగబీలుస్తూ చెప్పాడు.

"ముసిలోడు నాకేమి ఇయ్యలేదని అనుకోవద్దు. నీకు నా గుండికాయినే ఇస్తా," అని బనీను జేబులో చెయ్యిపెట్టి ఏదో వస్తువు తీసి నా చేతిలో పెట్టాడు.

అది భూతద్దం!

ఏడుపు బుగ్గలా ఎగదన్నింది నాకు.

ఏడవద్దు అన్నట్టు సైగ చేశాడు.

తరువాత ఏం మాట్లాడకుండా మగతలోకి జారుకున్నాడు.

అర్ధరాత్రివేళ కళ్లు తెరిచి, "అప్పుడు మీసాల పోలీసోడికి బాగా సేసినాం కదా," అని గొణిగాడు. అంత దుఃఖంలోనూ నాకు నవ్వు వచ్చింది.

"నాకు ఒకటే దిగులు. నేను పోతే ఈ వూర్లో వైద్యం ఎవరు సేస్తారురా?" అని గట్టిగా ఎగశ్వాస పీల్చాడు. అదే ఆఖరి శ్వాస.

మావూరి మహావైద్యగాడు నిశ్శబ్దంగా మహాభినిష్క్రమణం చేశాడు.

మనుషులు పోతారు- జ్ఞాపకాలే మిగులుతాయి.

*ఆంధ్రజ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక, 1992*